నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్

5 | మహబూబ్‌నగర్, సోమవారం 16 సెప్టెంబర్ 2024 | NAGARKURNOOL

పెద్దవాగులో తెగిపోయిన మిషన్ భగీరథ పైపులైన్‌ను పరిశీలిస్తున్న మిషన్ భగీరథ డీఈ వెంకట్‌రెడ్డి

పైపులైన్‌ను పరిశీలించిన డీఈ

నమస్తే ఎఫెక్ట్

మాగనూరు, సెప్టెంబర్ 15 : మండల కేంద్రంలోని పెద్ద వాగులో నీటి ప్రవాహానికి 12గ్రామాలకు నీరందించే మిషన్ భగీరథ పైప్‌లైన్ తెగి దాదాపు 20రోజులు తాగునీటికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయమై 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ఈనెల 10వ తేదీన తాగునీటి సమస్యపై 'దెబ్బతిన్న పైపులైన్' అనే కథనం ప్రచురితమైంది. దీంతో డీఈ వెంకట్‌రెడ్డి ఆదివారం స్పందించారు. పెద్దవాగులో మాగనూరు, కృష్ణ ఉమ్మడి మండల వ్యాప్తంగా తాగునీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ కనెక్షన్ పైప్‌లైన్‌ను డీఈ వెంకట్‌రెడ్డి పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ఎర్రవెల్లిలోని వ్యవసాయక్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ఆదివారం మాజీ మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. - మహబూబ్‌నగర్ అర్బన్/నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 15

నాగం జనార్దన్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ ముఖ్య నేతలు

నాగం, గువ్వలను కలిసిన కేటీఆర్

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 15 : మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత డాక్టర్ నాగం జనార్దన్‌రెడ్డిని ఆదివారం గులాబీ పార్టీ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నాగంను హైదరాబాద్‌లోని ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

గువ్వల స్వగృహానికి..

బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజును గచ్చిబౌలిలోని ఆయన స్వగృహంలో మాజీ మంత్రి కేటీఆర్ కలిశారు. కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉధృతం చేయాలని కేటీఆర్ సూచించారు. నిత్యం ప్రజల్లో ఉండి స్థానిక సంస్థల్లో సత్తా చాటాలని సూచించారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, జగదీశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, బాల్క సుమన్, రాకేశ్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, బీగల గణేశ్‌గుప్తా, బీఆర్ఎస్ నేత నాగం శశిధర్‌రెడ్డి, అచ్చంపేట మాజీ మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు కుటుంబ సభ్యులతో మాజీ మంత్రి కేటీఆర్

అయిజ నుంచి గద్వాల వెళ్లే రోడ్డు దుస్థితి

దారుణాలు

ప్రయాణం.. నరకప్రాయం

- ఉమ్మడి జిల్లాలో అధ్వానంగా రోడ్లు
- అడుగడుగునా గుంతలు.. వాహనాలు కరాబ్
- మట్టి రోడ్లపై అడుగుతీసి వేయలేని దుస్థితి
- ప్రయాణమంటేనే వాహనదారులకు హడల్
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ, పీఆర్ అధికారులు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. రోడ్లపై బీటీ కొట్టుకుపోయి కంకరతేలి అడుగడుగునా గుంతలు ఏర్పడడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. వాహనాలు పాడవుతున్నాయని యజమానులు వాపోతుండగా.. ప్రయాణికులకు ప్రాణసంకటంగా తయారైంది. ఇక మట్టిరోడ్ల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. వర్షం పడితే చాలు అడుగుతీసి వేయలేని దుస్థితి నెలకొంటున్నది. ఈ రహదారుల మీదుగా ప్రజాప్రతినిధులు, అధికారులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నా.. పట్టించుకునే నాథులే కరువయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంకా ఎన్నాళ్లీ దారుణాలు భరించాలని, మా కష్టాలు ఎప్పటికి 'దారి'కొచ్చేనా..? అంటూ ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఛిద్రమైన సడక్‌లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 15

గతుకుల ప్రయాణం

- నారాయణపేట జిల్లాలో ఏ ఊరెళ్లాలన్నా ఈ రోడ్లే గతి
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు, వాహనదారులు

మక్తల్ మండలం కర్నిలో గుంతలమయంగా మారిన బీటీ రోడ్డు

నారాయణపేట, సెప్టెంబర్ 15 : నారాయణపేట జిల్లాలోని రోడ్లెక్కితే ఒళ్లు హూనమవుతోంది. గతుకులు.. బురద రోడ్లపై ముందుకు వెళ్లాలంటే నిత్యం సాహసం చేయాల్సిందే.. అది జిల్లా కేంద్రమైనా.. మండల కేంద్రమైనా.. గ్రామాలు, తండాలైనా ఇదే దుస్థితి.. వర్షాకాలం వస్తే పరిస్థితి కడు దయనీయం. ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఎలాంటి ప్రయోజనం లేదని జిల్లా ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం..

కొడంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి వచ్చే నారాయణపేట జిల్లాలోని మండలాల్లో రూ.143.35 కోట్లతో చేపట్టనున్న 12 పనులకు నిధులు మంజూరై.. టెండర్లు కూడా పూర్తయ్యాయి. పేట నియోజకవర్గంలోని ధన్వాడ మండలంలో రూ.13 కోట్లతో చేపట్టనున్న పనులకు ఆర్‌అండ్‌బీ అధికారులు, 14 పనులకు పంచాయతీరాజ్ అధికారులు ప్రతిపాదనలు పంపారు. పేట –హైదరాబాద్ రోడ్డు నుంచి 3 కి.మీ. లోపలికి వెళ్లే అంత్వార్, బోయినపల్లి నుంచి తండాకు వెళ్లే రోడ్డుపై కంకర వేసి వదిలేశారు. అయ్యవారిపల్లికి మట్టి రోడ్డే గతి.. కొల్లంపల్లి స్టేజీ నుంచి వెళ్లే రోడ్డు, మరికల్–ఆత్మకూరు రహదారి గుంతలమయంగా మారింది. ఆత్మకూరు– చిత్తనూరు దారి అధ్వానంగా మారింది. ధన్వాడ మండలంలోని కంసాన్‌పల్లి–కొత్తపల్లి, దామరగిద్ద–పిడంపల్లి రోడ్డు నుంచి అయ్యవారిపల్లికి రోడ్డు సౌకర్యమే లేదు. కానుకుర్తి–ఆశన్‌పల్లి రోడ్డు గుంతలమయమైంది. మక్తల్ మండలం కాట్రేపల్లీ, గుర్లపల్లి, వనాయకుంట, దాసర్‌దొడ్డి, తిరుమలాపూర్, ముష్టిపల్లి–అనుగొండ, టేకులపల్లి, మదనపల్లి, జవలాపురం, మక్తల్–వాడ్వాట్, మక్తల్–పర్మన్‌దొడ్డి, గుర్లపల్లి–సంగంబండ, నర్సిరెడ్డిపల్లి గ్రామాలకు మట్టిరోడ్లే దిక్కయ్యాయి. ఊట్కూర్ మండలం వల్లంపల్లి, పేట రోడ్డు 3 కి.మీ. అధ్వానంగా మారింది. ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మగ్దుంపూర్–ఎరగట్‌పల్లి, జీర్ణహళ్లి, పెద్దజట్రం, నిడుగుర్తి వయా పెద్దజట్రం, బిజ్వారం–కొత్తపల్లికి, కొత్తపల్లి–ధన్వాడకు రోడ్డు సౌకర్యమే లేదు. చిన్నపొర్ల నుంచి ఎడవెల్లి, పులిమామిడి గ్రామాలది అదే పరిస్థితి. బాపురం నుంచి నిడుగుర్తి రోడ్డులో పాదచారులు సైతం అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి. మాగనూరు మండలంలో హైవేను అనుసరించి ఉన్న వడ్వాట్ స్టేజీ నుంచి మందిపల్లి వరకు 20 కి.మీ. రోడ్డుపై బీటీపోయి గుంతలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. మాగనూరు నుంచి వర్కూర్, నేరడగం, ఉజ్జెలి వరకు 20 కి.మీ. బీటీది ఇదే దుస్థితి. కృష్ణ మండలం గుడెబల్లూరు నుంచి ముడుమాల్ వరకు, టైరోడ్ నుంచి మురహరిదొడ్డి, కుసుమూర్తి నుంచి ఎస్కేపల్లి, చేగుంట నుంచి ఐనాపూర్ వరకు, కృష్ణ నుంచి గురజాల రోడ్డుపై ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కొత్తపల్లి మండలం మహబూబ్‌నగర్–మద్దూరు ప్రధాన రహదారిలో లింగాల్‌చేడ్ నుంచి మద్దూరు రోడ్డు గతుకులుగా మారింది. మద్దూరు–రెనివట్ల–రాళ్లబాయి వరకు మట్టిరోడ్డు బురదమయంగా మారింది. గుండుమల్–పగిడ్యాల మట్టి రోడ్డులో నూ గ్రామస్తులకు అవస్థలే.. కోస్గి మండలం తోగాపూర్–పందిర హనుమాన్లకు మట్టిరోడ్డుతో తిప్పలే.

ధరూర్ మండలం ప్రాజెక్టుకు వెళ్లే రహదారి

గద్వాల, సెప్టెంబర్ 15 : జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలుపడి.. బురదగా మారడంతో ప్రయాణం.. ప్రాణసంకటంగా మారింది. ఇప్పటికే వాహనాలు ప్రమాదాలకు గురయ్యాయి. నిత్యం ఇవే రోడ్లపై ప్రజాప్రతినిధులు, అధికారులు రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక రోడ్లు, భవనాలు, పీఆర్ శాఖ అధికారులు కార్యాలయాల్లో ఉండడం లేదని, ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదని స్థానికులు ఆగ్రహం చెందుతున్నారు. జిల్లా కేంద్రంలోని పీఆర్ ఆఫీస్ ఎదుటే రోడ్డు మధ్యలో పెద్ద గుంత ఏర్పడింది. అలాగే అంబేద్కర్‌చౌక్–బీరెల్లి చౌరస్తా వరకు, గద్వాల–అయిజ రోడ్డు, రైల్వేస్టేషన్–కొండపల్లి వరకు, గద్వాల–జూరాల డ్యాం రోడ్డు, గద్వాల–రాయిచూర్ రోడ్డు, ధరూర్–జాంపల్లి రహదారి, అలంపూర్ వయా అయిజ మీదుగా రాయిచూర్‌కు వెళ్లే అంతర్రాష్ట్ర రోడ్డుపై మిట్టదొడ్డి స్టేజీ తర్వాత బలిగేర వరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. మల్దకల్ మీదుగా ధరూర్, మార్లబీడు రోడ్డు అడుగడుగునా గుంతలుపడి అందులో వర్షపు నీళ్లు నిలుస్తున్నాయి. అయిజ మండలం చిన్నతాండ్రపాడు, మేడికుంద రోడ్డు, గద్వాల మండలం మేలచెర్వు, బీ రెల్లి రోడ్డు, మానవపాడ్, చెన్నిపాడ్ మీదుగా పోతులపాడు స్టేజీ వరకు, ఇటిక్యాల నుంచి శివనంపల్లి మీదుగా జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డు అంటేనే ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. శాంతినగర్ నుంచి జిల్లెడుదిన్నె, రామాపురం బీటీరోడ్డు గుంతలు పడగా.. రాత్రివేళ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. అయిజ మండలం వెంకటాపురం స్టేజీ నుంచి ఇటిక్యాల మండలం వేముల గ్రామ స్టేజీ రోడ్డుది కూడా ఇదే పరిస్థితి.

నిధులున్నా చేపట్టని పనులు..

రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ పనులు చేపట్టడం లేదు. టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకురావడం లేదని అధికారులు అంటున్నారు. గద్వాల నియోజవర్గంలోని 150 కి.మీ. ఆర్‌అండ్‌బీ రహదారుల మరమ్మతులకు సుమారు రూ.60 లక్షలు, అలంపూర్ నియోజకవర్గ పరిధిలో 70 కి.మీ. రోడ్ల రిపేర్లకు రూ.60 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అలాగే పీఆర్ పరిధిలో రోడ్ల మరమ్మతుకు ప్రతి నియోజకవర్గానికి రూ.20 కోట్ల చొప్పున జిల్లాలో రూ.40 కోట్లతో మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపగా అనుమతులు రాలేదు.

కృష్ణారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఎమ్మెల్యేకు సీఎం పరామర్శ

- దేవరకద్ర ఎమ్మెల్యే తండ్రికి నివాళులర్పించిన రేవంత్‌రెడ్డి

దేవరకద్ర రూరల్ (చిన్నచింతకుంట), సెప్టెంబర్ 15 : ఈ నెల 5వ తేదీన దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. ఈ క్రమంలో ఆదివారం ఎమ్మెల్యే స్వగ్రామమైన మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ గ్రామంలో కృష్ణారెడ్డి దశదినకర్మ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై ఎమ్మెల్యే తండ్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచందర్‌రెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, శంకర్, వాకిటిశ్రీహరి, పర్ణికారెడ్డి, రాజేశ్‌రెడ్డి, వంశీకృష్ణ, మేఘారెడ్డి, కశిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, నాయకులు భాస్కర్, హర్షవర్ధన్‌రెడ్డి, జలందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాగనూరు–నేరడిగం వరకు గుంతలుగా మారిన రోడ్డు